

ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని టీటీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యలమంచిలి వెంకటగాంధీ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శుక్రవారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి కమ్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

- దిల్‌సుఖ్‌నగర్, ఆంధ్రజ్యోతి



రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడంలో ప్రత్యేక చొరవ చూపిన సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వంలోని నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని ఆయన రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. - చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి

మీర్‌పేట్ కార్పొరేషన్ అభివృద్ధిపై దృష్టి సారించండి

- సీఎంను కోరిన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి


సరూర్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కాంగ్రెస్ మీర్‌పేట్ శాఖ మాజీ అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శుక్రవారం పలువురు పార్టీ నేతలతో కలిసి ఆయన సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి బొకే అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మీర్‌పేట్‌లోని చెరువులను సుందరీకరణ పేరుతో ఎఫ్‌టీఎల్‌ను కుదించి కబ్జాకు ఆస్కారమిచ్చిన అంశాలతో పాటు ఇతర సమస్యలను సైతం గోపాల్‌రెడ్డి సీఎంకు వివరించారు. ఇటీవల పార్టీలో చోటుచేసుకున్న పలు పరిణామాలు, మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాసం వీగిపోవడం వంటి అంశాలపైనా చర్చించుకున్నారు. కాగా శివారు కార్పొరేషన్లు, మునిసిపాలిటీలపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వాటి అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నదని సీఎం చెప్పినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో గోపాల్‌రెడ్డి తదితరులు

బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయండి: రజనీరావు

కొత్తపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ బ్రాహ్మణ జేఏసీ పొలిటికల్ ఇన్‌చార్జి రజనీరావు సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. రాష్ట్రంలో బ్రాహ్మణుల అభ్యున్నతికి, వారి సర్వతోముఖాభివృద్ధికి కార్పొరేషన్ ఎంతగానో ఉపకరిస్తుందని ఆమె ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె గురువారం రాత్రి సీఎం నివాసంలో ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు.



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రజనీరావు



థీమ్ పార్క్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

వనస్థలిపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ ఫేజ్-3లో కోటి ఇరువై అయిదు లక్షల వ్యయంతో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న థీమ్ పార్క్ పనులను శుక్రవారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు ఎకరం స్థలంలో అద్భుతమైన థీమ్ పార్క్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఇందులో బుద్ధుడి విగ్రహం, యోగా స్థలం, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే పార్క్, వాకింగ్‌ట్రాక్, మూత్రశాలలు, గార్డెన్‌లను అద్భుతంగా నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే దాదాపు తొంభై శాతం పనులు పూర్తి అయ్యాయని, మిగిలిన ఇతర పనులను పూర్తిచేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, నాయకులు అనంతుల రాజిరెడ్డి, పోగుల రాంబాబు, రాఘవేందర్‌రావు, రవి, నాగరాజు పాల్గొన్నారు.



నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి

నేరాల నియంత్రణపై అవగాహన

చంపాపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో శుక్రవారం సీపీ, డీసీపీ ఆదేశాల మేరకు రాచకొండ షీ టీమ్స్, సైబర్ క్రైం పోలీస్ అధికారులు ఎల్ఈడీ ద్వారా నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భక్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోలీస్ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో బంజారాహిల్స్ ట్రాన్సయ్య, పోలీస్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు విరాళం అందజేస్తున్న మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు

బుద్ధిమాంద్యం విద్యార్థులకు విరాళం

ఎల్‌బీనగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి బుద్ధిమాంద్యం గల విద్యార్థుల కోసం విరాళం ఇచ్చారు. ఆర్‌కేపురం కాలనీ రోడ్ నంబర్ 4లోని ఎస్‌కేవై స్పెషల్ స్కూల్‌కు (మానసిక బుద్ధిమాంద్యం గల విద్యార్థుల స్కూల్) మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు రూ. 25వేలు అందజేశారు. జ్ఞానేశ్వర్‌యాదవ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ నేత కిరణ్ అంత్యక్రియలు

హైదరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆటోమోటారు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్రనాయకుడు వి.కిరణ్‌కు శుక్రవారం సాయంత్రం దమ్మాయిగూడ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. కిరణ్ మృతికి ఏఐటీయూసీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు బోస్, బీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, రవిశంకర్ తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

రెవెన్యూ కార్యాలయమా..

- కౌన్సిల్ తీర్మానం ఒకరికి.. కలెక్టర్ లేఖ మరొకరికి
- సందిగ్ధంలో బడంగ్‌పేట్ పాత భవనం కేటాయింపు అంశం

జలమండలి, ట్రాన్స్‌కో ఆఫీస్‌లా..!?

సరూర్‌నగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయం పాత భవనం ఎవరికి కేటాయించాలి అనే అంశంపై సందిగ్ధత నెలకొన్నది. సదరు పాత భవనంలో 2014 నుంచి ఈ ఏడాది జనవరి దాకా బడంగ్‌పేట్ నగర పంచాయతీ కార్యాలయం, అనంతరం బడంగ్‌పేట్ మునిసిపాలిటీ కార్యాలయం, ఆ తర్వాత బడంగ్‌పేట్ నగరపాలక సంస్థ కార్యాలయం కొనసాగిన సంగతి తెలిసిందే. కాగా కార్పొరేషన్ కార్యాలయం కోసం ఇక్కడి దావూద్‌ఖాన్‌గూడలోని సర్వే నంబర్.2లో గల ప్రభుత్వ స్థలంలో నిర్మించిన నూతన భవనం ఈ ఏడాది జనవరి చివర్లో అందుబాటులోకి రావడంతో పాత భవనాన్ని ఖాళీ చేసి అన్ని విభాగాలను కొత్త భవనంలోకి తరలించారు. బడంగ్‌పేట్ ప్రధాన కూడలికి సమీపంలో మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ఈ భవనం ఎవరికి కేటాయిస్తారు అనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ భవనంపై మూడు శాఖలు దృష్టి సారించడంతో ఏ శాఖకు కేటాయించాలి అన్నది ప్రశ్నార్థకంగా తయారయింది.



బడంగ్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయం పాత భవనం

వాటర్ వర్క్స్, ట్రాన్స్‌కో ఆఫీస్‌ల కోసం కౌన్సిల్ తీర్మానం

బడంగ్‌పేట్ మునిసిపల్ పాత భవనాన్ని వాటర్ వర్క్స్(జలమండలి)తో పాటు ట్రాన్స్‌కో(విద్యుత్)శాఖ కార్యాలయాలకు కేటాయించాలని నిర్ణయించి ఆమేరకు ఫిబ్రవరి 17న జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ప్రస్తుతం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు సంబంధించిన వాటర్ వర్క్స్ కార్యాలయం బీఎన్‌రెడ్డినగర్‌లోని సాహెబ్‌నగర్ రిజర్వాయర్ వద్ద కొనసాగుతోంది. అక్కడ పలువురు ఉన్నతాధికారులతో పాటు బడంగ్‌పేట్ కార్పొరేషన్‌కు సంబంధించిన మేనేజర్ సైతం ఉంటారు. నీటి సరఫరాకు సంబంధించిన ఎలాంటి సమస్య ఉన్నా ఇక్కడి నేతలు, ప్రజలు అక్కడికే వెళ్లాల్సి వస్తోంది. సమస్యల పరిశీలన కోసం అధికారులు సైతం అక్కడి నుంచి ఇక్కడకు రావాల్సి వస్తోంది. ఈ దృష్ట్యా తమ చెంతనే అధికారులు ఉంటే సమస్యలు తొందరగా పరిష్కారమవుతాయని భావించిన కార్పొరేషన్ పాలకవర్గం.. వాటర్‌వర్క్స్ విభాగానికి తమ పాత భవనంలోని కొంత భాగాన్ని కేటాయించాలని నిర్ణయించి ఆ మేరకు తీర్మానం చేసింది. అదేవిధంగా బడంగ్‌పేట్‌కు ప్రత్యేకంగా ట్రాన్స్‌కో సెక్షన్‌ను ఏర్పాటు చేసి ఏఈని నియమించినందున ఏఈతో పాటు ఇతర సిబ్బంది ఉండడానికి సైతం కార్యాలయం అవసరం కావడంతో తమ కార్యాలయంలోని ఇంకొంత భాగాన్ని ట్రాన్స్‌కోకు కేటాయించాలని కౌన్సిల్‌లో తీర్మానించారు. పాత భవనం మొదటి అంతస్తులో సదరు రెండు విభాగాలు(వాటర్ వర్క్స్, ట్రాన్స్‌కో) తమ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవచ్చునని ఈ తీర్మానంలో పేర్కొన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌ను మాత్రం అత్యవసర వినియోగం నిమిత్తం మునిసిపల్ ఆధీనంలోనే ఉంచుకోవాలని నిర్ణయించారు. ఇక రెండో అంతస్తులోని మీటింగ్ హాల్‌ను సైతం తమ ఆధీనంలోనే పెట్టుకుని, అవసరమైనప్పుడు మెప్మా విభాగం సమావేశాలకు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు.

బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం కోసం కలెక్టర్ లేఖ

బడంగ్‌పేట్ పాలకవర్గం కౌన్సిల్‌లో తీర్మానం చేసిన తర్వాత జిల్లా కలెక్టర్ నుంచి మునిసిపల్ అధికారులకు ఓ లేఖ అందింది. పాత భవనాన్ని బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించాలని ఆ లేఖలో కలెక్టర్ కోరారు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం బాలాపూర్‌లోని పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో, ఇరుకిరుకు గదుల్లో కొనసాగుతోంది. దాంతో ఖాళీ అయిన బడంగ్‌పేట్ మునిసిపల్ కార్యాలయం తమకు కావాలని తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌ను కోరడతో ఆ మేరకు కలెక్టర్ కార్పొరేషన్‌కు లేఖ రాశారు. అయితే అప్పటికే తాము వాటర్ వర్క్స్, ట్రాన్స్‌కో కార్యాలయాల కోసం భవనం కేటాయించడానికి తీర్మానం చేసినందున తహసీల్దార్ కార్యాలయానికి ఇవ్వలేమని మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. స్వయానా కలెక్టరే లేఖ రాసినందున సదరు భవనాన్ని ఎలాగైనా తహసీల్దార్ కార్యాలయానికి కేటాయించాల్సిందేనని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. దాంతో ఈ భవనం కేటాయింపు అంశం సందిగ్ధంగా మారి ప్రభుత్వ శాఖల మధ్య రచ్చకు దారితీస్తోంది. కౌన్సిల్ తీర్మానానికి కట్టుబడి ఉండాలో.. లేక కలెక్టర్ లేఖకు ప్రాధాన్యం ఇవ్వాలో తేల్చుకోలేక మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు తల పట్టుకుంటున్నారు. ఆయా విభాగాలు సైతం మునిసిపల్ పాత భవనం కోసం ఎవరి స్థాయిలో వారు పట్టుబట్టి ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. మరి.. చివరకు ఈ భవనం ఎవరి సొంతం అవుతుందో వేచి చూడాల్సిందే.

కాంగ్రెస్‌లోకి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్

ఎల్‌బీనగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోటగిరి శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉపముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ల సమక్షంలో కాంగ్రెస్ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి శ్రీనివాస్‌గౌడ్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అంతకు ముందు ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రజాపాలన పట్ల ఆకర్షితుడినై పార్టీలో చేరినట్లు చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, చేగోని అశోక్‌గౌడ్, సీనియర్ నాయకుడు జైశంకర్‌గౌడ్, మల్లారపు శ్రీనివాస్, బుడ్డ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్

గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు..

వనస్థలిపురం : సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితుడినై కాంగ్రెస్‌లో చేరినట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, అఖిల భారత గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, గౌడ సంఘాల జేఏసీ కో-కన్వీనర్ కూరెళ్ల వేములయ్యగౌడ్ అన్నారు. పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆధ్వర్యంలో కూరెళ్ల వేములయ్యగౌడ్ తన అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ఈ మేరకు వేములయ్యగౌడ్‌కు దీపాదాస్ మున్షి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ఎస్ఎఫ్ఐ ఎల్‌బీనగర్ డివిజన్ నూతన కార్యవర్గం

ఎస్ఎఫ్ఐ కార్యవర్గం ఎన్నిక

ఎల్‌బీనగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ ఎల్‌బీనగర్ డివిజన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అరుణ్, కార్యదర్శిగా స్టాలిన్, ఉపాధ్యక్షులుగా వేణు, జ్యోతిబస్, సుమంత్, రమేష్, సహాయ కార్యదర్శులుగా శివ, నవీన్, శ్రీకాంత్‌లతో పాటు 15 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలతో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ ఉద్యమాల కార్యాచరణ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గుండె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజూ వార్షిక బ్రహ్మోత్సవాలు

- హాజరైన ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

చంపాపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడ సాగర్ రింగ్‌రోడ్ డిఫెన్స్ కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి ఆలయంలో 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజు శుక్రవారం భక్తి శ్రద్ధలతో కొనసాగాయి. ఆలయంలో ఉదయం జగద్గురు హంపీ విరూపాక్ష విద్యారణ్యభారతి స్వామి గణపతి పూజ, స్వస్తి పుణ్యావచనం, శ్రీవల్లి దేవసేన సమేత, రమాలక్ష్మి అమ్మవార్లకు, ధ్వజస్తంభ యంత్ర ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, బలిహరణం, పూర్ణాహుతి, కుంబాభిషేకంలో పాల్గొని పూజలు చేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఆలయ వ్యవస్థాపకులు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హిందూధర్మం జ్యోతిష్యులు బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామశరన్‌శర్మ గురూజీ, రమణ గురుస్వామి, రాజేష్‌పాండే పర్యవేక్షణలో లక్ష్మీనారసింహస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి మంగారెడ్డి, డైరెక్టర్లు సందీప్‌రెడ్డి, విజ్ఞేశ్వర్‌రెడ్డి, సూర్యప్రకాష్‌గుప్తా, రమేష్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, మిరియాల అంజయ్యగుప్తా, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



పూర్ణాహుతిలో హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి, ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

తాటిచెట్టుకు నిప్పు.. తెగిపడిన విద్యుత్ వైర్లు

- తప్పిన ప్రమాదం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నగర శివారు అబ్దుల్లాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీ ఎదురుగా 33 కేవీ విద్యుత్ లైన్ కింద ఉన్న తాటిచెట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. చెట్టు నుంచి మంటలు పెద్ద ఎత్తున చెలరేగి విద్యుత్ తీగలకు తాకాయి. దీంతో భారీ శబ్దంతో తీగలు తెగిపడ్డాయి. అయితే తీగలు రోడ్డు వైపు కాకుండా అవతలి వైపుకు పడడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకుని మరమ్మతు పనులు చేశారు.



నిప్పంటుకుని కూలిపోయిన తాటిచెట్టు

బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ ఎన్నిక నేడు

- 31న సంఘం సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్ మార్చి 22(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాటసింగారం రైతుసేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశం ఇన్‌చార్జి చైర్మన్ నార్లకొండ మల్లమ్మ అధ్యక్షతన శుక్రవారం సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈనెల 31న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు తీర్మానించారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు భరత్‌చేగూరి, కొత్తపల్లి జైపాల్‌రెడ్డి, గంట శ్రీనివాస్‌రెడ్డి, ఇటికల మహేందర్‌రెడ్డి, మొగుళ్ల చిన్న యాదిరెడ్డి, బిజిలి బాలనర్సింహ, మేకల రాములు, చింతల లక్ష్మమ్మ, బ్యాంక్ మేనేజర్ ఐలేష్‌యాదవ్ పాల్గొన్నారు.

చైర్మన్ ఎన్నిక నేడు..

బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డిపై 9 మంది డైరెక్టర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఆయన చైర్మన్ పదవి కోల్పోయారు. దాంతో సంఘం వైస్ చైర్మన్ నార్లకొండ మల్లమ్మకు ఇన్‌చార్జి చైర్మన్‌గా అధికారులు బాధ్యతలను అప్పగించారు. కాగా శనివారం సంఘం కార్యాలయంలో ఉదయం 12.30 గంటలకు డీసీవో సమక్షంలో సంఘం నూతన చైర్మన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించనున్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

కొత్తపేట : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 67 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐలు మధు, దయాకర్‌రెడ్డిల కథనం ప్రకారం ఎంపీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం రాత్రి పోలీసులు సాగర్ రింగ్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో యంజాల్ శ్రీరాంనగర్ నివాసి గొండి కృష్ణారెడ్డి(62) అక్రమంగా 39 మద్యం బాటిళ్లు విక్రయించేందుకు తీసుకెళ్తుండగా అదుపులోకి తీసుకొని బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. చింతలకుంట సరస్వతినగర్ టీస్టాల్ నిర్వాహకుడు బోయ చెన్నప్ప(56) మద్యం విక్రయిస్తుండగా పట్టుకొని 28 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు.

హనుమాన్ ఆలయంలో ఎమ్మెల్సీ, జడ్పీ చైర్‌పర్సన్ పూజలు

చంపాపేట: కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయంలో ధ్యానాంజనేయస్వామిని శుక్రవారం ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్, మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి ఆశీర్వచనాలు అందించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. వారి వెంట జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



అర్చకుల ఆశీర్వచనాలు పొందుతున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీత



ట్రస్ట్ ప్రతినిధులతో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఘనంగా సాయిబాబా ట్రస్ట్ వార్షికోత్సవం

మన్సూరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నాగోల్ జైపురి కాలనీలో షిరిడీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ 12వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా హాజరై సాయినాథుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొలను వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొరివి జంగయ్యగుప్తా, కోశాధికారి రావుల రంజిత్‌గౌడ్, గుణగంటి రాములుగౌడ్, సోమయ్య పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ఉరేసుకుని ముగ్గురి ఆత్మహత్య

- అదనపు కట్నం వేధింపులకు తాళలేక వివాహిత..

వనస్థలిపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలని భర్త పెట్టిన వేధింపులకు తట్టుకోలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా పెద్ద వంగర మండలం కనాయిగూడేనికి చెందిన శ్రావణి(20) వనస్థలిపురం సత్యసాగర్ కాలనీలో నివాసముంటు పెయింటర్‌గా విధులు నిర్వహిస్తున్న తాళ్లపల్లి శ్రీశైలం(26)తో గత ఏడాది వివాహం జరిగింది. వీరికి 10నెలల ఒక బాబు ఉన్నాడు. కాగా వీరి పెళ్లి సమయంలో శ్రీశైలంకు 14తులాల బంగారం, రెండు లక్షల నగదును వరకట్నంగా ఇచ్చారు. కొన్ని రోజులుగా శ్రావణిని శ్రీశైలం అదనపు కట్నం కోసం వేధిస్తుండగా శ్రీశైలం అత్తమామలు వరకట్నం కింద ఒక ద్విచక్ర వాహనాన్ని ఇప్పించారు. అనంతరం మరో 3లక్షలు అదనపు కట్నం కావాలని వేధించడంతో కొంత నగదును ఇచ్చి మిగిలిన నగదు కొద్ది రోజుల్లోనే ఇస్తామని శ్రీశైలం అత్తమామలు ఒప్పుకున్నారు. దీంతో భార్యభర్తల మధ్య తరుచూ గొడవలు జరగడంతో అదే కాలనీలో భార్యభర్తలు అద్దెకు ఇళ్లు తీసుకుని వేరువేరుగా ఉంటున్నారు. కాగా శుక్రవారం శ్రావణి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని శ్రీశైలం వారి అత్తమామలకు ఫోన్ చేసి చెప్పాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. అదనపు వరకట్నం వేధింపులతోనే తమ కూతురు శ్రావణి ఆత్మహత్యకు పాల్పడిందని, తమ కూతురు మృతికి కారణమైన శ్రీశైలంను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని శ్రావణి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



శ్రావణి మృతదేహం

చదువుకోలేనన్న మనస్తాపంతో యువకుడు..

చాదర్‌ఘాట్: తల్లిదండ్రులు ఆశించిన మేరకు చదువు కోలేన్న మనస్తాపంలో యువకుడు ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మలక్‌పేట ఎస్ఐ జయంత్ తెలిపిన వివరాల ప్రకారం మూసారాంబాగ్ ఎస్‌బీఐ ఆఫీసర్స్‌కాలనీ నివాసి ఆగిర్ చాణక్య(22) ప్రైవేటు కళాశాలలో డిప్లొమా చదువుతున్నాడు. తన ఇద్దరు అన్నలు బాగా చదువుకుని అమెరికా లో ఉన్నారని, తనకు మాత్రం చదువుకోవాలన్న ఆసక్తిలేక మొదటి నుంచి అన్నింటిలోనూ వెనకబడి పోతున్నాడు. ఎంత చదివినా ఫెయిల్ అయిన వాటిలో ఉత్తీర్ణత సాధించలేకపోతున్నానని బాధపడుతూ గురువారం రాత్రి చాణక్య తన తల్లితో చెప్పి తన గదిలోకి వెళ్లాడు. శుక్రవారం ఉదయం పనిమనిషి చాణక్య గదిని శుభ్రం చేసేందుకు వెళ్లగా ఎంతకూ గది తలుపు తెరవకపోవడంతో అతని తల్లికి తెలిపింది. అనంతరం కుటుంబీకులు గది తలుపులు తెరవగా చాణక్య ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడని మలక్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం అతన్ని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండో పెళ్లికి కుటుంబం సహకరిస్తలేదని..

చాదర్‌ఘాట్ : ఇంట్లో ఉరేసుకుని ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. శాలివాహననగర్ కాలనీ నివాసి రాజేంద్రప్రసాద్(62) రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి, ఇతనికి భార్య నలుగురు కూతుర్లు ఉన్నారు. ఇద్దరు కూతుర్లు అమెరికాలో ఉండగా, మరో కూతురు బెంగళూరులో, నాలుగో కూతురు తనతో ఇంట్లో ఉంటుంది. తన భార్యకు విడాకులు ఇచ్చి రెండో పెళ్లి చేసుకుంటానని తరచూ కుటుంబీకులతో అనేవాడు. గురువారం కూడా ఇదే తరహాలో సంభాషించినా ఎవరూ పట్టించుకోకపోవడంతో మనస్తాపంతో గురువారం రాత్రి తన గదిలోకి వెళ్లాడు. శుక్రవారం ఉదయం చూసేసరికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడంటూ కుటుంబీకులు మలక్‌పేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. మలక్‌పేట ఎస్ఐ జయంత్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదకరం

- టీటీఐ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్
- టీటీఐలో 50మంది మందుబాబులకు కౌన్సెలింగ్

కొత్తపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ సూచించారు. కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 50మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సీపీ క్యాంపు వద్ద ట్రాఫిక్ చిల్డ్రన్ పార్కు లెక్చర్ హాల్‌లో శుక్రవారం మూడు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ మాట్లాడుతూ కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం మద్యం మత్తులో వాహనాలు నడపడం మానాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురైన వారి వీడియో క్లిప్పులు, ప్రముఖుల సందేశాలు, మద్యంమత్తు అనర్థాలకు అద్దంపట్టే పాటలనూ ప్రదర్శించారు. అనంతరం విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఎస్ఓపీ అల్లూరయ్య మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపితే నడిపిన వారితో పాటు ఆ దారిలో వెళ్లే ఇతరులూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ప్రమాద తీవ్రతను తగ్గించడానికి బైకులు నడిపే వారు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లు నడిపే వారు సీట్ బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మద్యం తాగి వాహనాలు నడపరాదని కోరారు. టీటీఐ సిబ్బంది రమేష్, రవి కౌన్సెలింగ్‌కు హాజరైన వారికి అవగాహన కోసం వీడియో క్లిప్పులు, పాటలూ ప్రదర్శించారు.



కౌన్సెలింగ్‌లో మాట్లాడుతున్న టీటీఐ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్